క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

నాగేశ్వరరావు దంపతులకు సత్కారం



నాగేశ్వరరావు, లావణ్య దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

భీమునిపట్నం: జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన భీమిలికి చెందిన రన్నర్స్ నాగేశ్వరరావు, లావణ్య దంపతులను శనివారం రాత్రి జమ్మి చెరువు పార్కు వాకర్స్ అసోసియేషన్ వారు సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా దంపతులు పలు పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారని కొనియాడారు. వీరి వల్ల భీమిలికి ఎంతో గుర్తింపు, పేరు వచ్చిందని, మరిన్ని పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సభ్యులు ఎస్.జనార్ధనరావు, లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

18 మంది వలంటీర్లు రాజీనామా

ఆనందపురం : ఆనందపురం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 18 మంది వలంటీర్లు ఆదివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇక్కడ 24 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కుట్ర వల్ల ప్రజలకు సేవ చేసే అవకాశం కోల్పోయామని చెప్పారు. దీంతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని, భీమిలి నుంచి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావుని గెలిపించడానికి స్వచ్ఛందంగా ప్రచారం చేస్తామని వలంటీర్లు చెప్పారు.

సెయింట్ పీటర్స్ చర్చిలో సీపీ రవిశంకర్



కీటిన్‌పేటలోని పురాతన సెయింట్ పీటర్స్ చర్చిలో సీపీ రవిశంకర్ అయ్యర్, తదితరులు

తగరపువలస : నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ ఆదివారం భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేటలోని పురాతన సెయింట్ పీటర్స్ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా చర్చి విశేషాలను పాస్టర్ ప్రభుదర్శన్, ప్రతినిధి పెనుమాక జాన్ చార్లెస్‌ను అడిగి తెలుసుకున్నారు. చరిత్ర, ఆరాధన, ప్రత్యేకతలను ఆయనకు తెలియజేశారు. అనంతరం భీమిలి, కుమ్మరిపాలెంలోని డచ్ సమాధులను చూశారు. ఆయనతోపాటు ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, మధురవాడ జోన్ ఏసీపీ సునీల్, భీమిలి సీఐ డి.రమేష్, మధురవాడ ట్రాఫిక్ సీఐ కాంతారావు, భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు వున్నారు.

సీఎం జగన్‌కే సుపరిపాలన సాధ్యం



ఎండాడలో దోశ వేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఓటుతో సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవండి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాజకీయాల్లో అవినీతికి మారుపేరు చంద్రబాబు అయితే... విశ్వసనీయత, మాటతప్పని నైజం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలన సీఎం జగన్‌తోనే సాధ్యమని... రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ, సుపరిపాలనకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల స్కైలైన్ అపార్ట్‌మెంట్, ఎంవీవీ అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు పేదల జీవితానికి, పెత్తందారుల అహంకారానికి మధ్య జరిగే పోరాటమన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో నేడు ఏం చేస్తారో, ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో జనసేన, బీజేపీతో కూటమి కట్టారన్నారు. అధికారం కోసం మాయ మాటలు చెప్పే ఈ కూటమిని ఎవరూ నమ్మవద్దని కోరారు.

శరవేగంగా 8వ వార్డు అభివృద్ధి

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గాన్ని ఏనాడూ పట్టించుకోలేదని, కేవలం శిలా ఫలకాలు వేసి అభివృద్ధిగా చూపించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 8వ వార్డులోనే రెండు యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేశామని, ఎండాడ చెరువు అభివృద్ధి చేశామని, థీమ్ పార్కులు, ఎక్కడికక్కడ ఎల్ఈడీ లైట్లు, బీచ్‌రోడ్డు పార్కుల సుందరీకరణ, ముఖ్యమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి చేసే నాయకుడు కావాలో, అవినీతి చేసే నాయకుడు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. అనంతరం ఎండాడ రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాల సముదాయాల వద్ద వ్యాపారస్తులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఓ టిఫిన్ దుకాణం వద్ద దోశలు వేస్తు ప్రచారం నిర్వహించారు. మిరాకిల్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ముఖ్య నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, మాదు చంటి, దువ్వి వాసు, చిల్లా శ్రీనివాసరెడ్డి, వేణుగోపాలరెడ్డి, బెందాలం పద్మావతి, కిల్లంపల్లి రాజు, జ్యోతిర్మయి, భాస్కర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఉత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

భీమునిపట్నం: భీమిలిలో గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవ ఏర్పాట్లను విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదివారం పరిశీలించారు. ఆయన అమ్మవారి ఆలయం వద్దకు రాగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడితూరి శ్రీనివాసరావు ఏర్పాట్లను వివరించారు. ఆలయం వద్ద భక్తుల దర్శనాలకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, తాగునీరు, నీడ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు పరిశీలించిన సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గంటస్తంభం వేదిక వద్ద బాణసంచా కాల్చడం, నేల వేషాలు, బళ్ల వేషాలు నిర్వహణ తీరును వివరించారు. అనంతరం సీపీ రవిశంకర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సీఐ రమేష్‌కు సూచించారు.

పండగ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

తగరపువలస: భీమిలి నూకాలమ్మ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి ఈ నెల 10 వరకు ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా విజయనగరం, తగరపువలస నుంచి వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లను వుడా ఫుట్‌బాల్ స్టేడియంలో పార్కింగ్‌కు అనుమతించారు.

- ఆనందపురం, భీమిలి క్రాస్ రోడ్డు మీదుగా వచ్చే వాహనాలకు యోగాశ్రమం వద్ద పార్కింగ్‌కు అనుమతించారు.
- విశాఖ నుంచి బీచ్‌రోడ్డులో వచ్చే వాహనాలను నేరెళ్లవలస కాలనీ ఏపీఆర్ స్కూల్ వద్ద పార్కింగ్ చేసుకోవడానికి అనుమతించారు.
- వీఐపీ కార్‌పాస్‌లు కలిగి ఉన్న వ్యక్తులు డైట్ కళాశాలకు దిగువన రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకోవచ్చు.
- భీమిలి పట్టణంలో నుంచి వచ్చే వాహనాలను సెయింటాన్స్ స్కూల్ ఆవరణలో పార్కింగ్ చేసుకోచ్చు.
- విశాఖ నుంచి బీచ్‌రోడ్డు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులు ఏపీఆర్ స్కూల్ వద్ద తిప్పుకోవాలి.
- భీమిలి క్రాస్‌రోడ్డు మీదుగా వచ్చే ఆర్టీసీ బస్సులు చినబజారు మీదుగా భీమిలి కొత్త బస్టాండ్‌కు చేరుకోవాలి.
- భీమిలి బీచ్‌రోడ్డు మీదుగా శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే వాహనాలు నేరెళ్లవలస కాలనీ, నరసింహస్వామి ఆలయం, చినబజారు మీదుగా భీమిలి క్రాస్‌రోడ్డు వైపు వెళ్లాలి.
- భీమిలి సెయింటాన్స్ స్కూల్ నుంచి ఏపీఆర్ స్కూల్ వరకు ఎలాంటి వాహనాలను అనుమతించరు. అలాగే భీమిలి ఎస్‌బీఐ కూడలి నుంచి డైట్ కళాశాల వరకు కూడా ఎలాంటి వాహనాలను అనుమతించరు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింటా ప్రచారం



ఆదర్శనగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బంగ్లామెట్టపై ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస: రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున భీమిలి అసెంబ్లీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో నిర్వహించిన ప్రచారంలో జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి, మద్ది మహాలక్ష్మి, ఇంజే వరలక్ష్మి, ఊడికల శ్రీరామమూర్తి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, కొనసన శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒకటో వార్డు బంగ్లామెట్టపై జరిగిన ప్రచారంలో ఇంటి నరసింగరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వెంపాడ వెంకటరమణ, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, యూత్ అధ్యక్షుడు అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, కె.సూర్యనారాయణ, గండి అనిల్‌కుమార్, కృష్ణ, పాలె రవి, కుంచా శివరామకృష్ణ, తమ్మిన అశోక్, సోమి అప్పలరాజు, గంట్రేటి ఈశ్వరరావు, సిమ్మల ప్రసన్న, చింతగుంట శివ, నీలాపు రామిరెడ్డి, దుంప సాయిరెడ్డి, రొక్కం శ్రీను, గురవయ్య, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి రక్తం నిల్వ యూనిట్

- భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు



రక్తాన్ని భద్రపరిచే యునిట్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తాన్ని నిల్వ చేసుకునే యూనిట్ అందుబాటులోకి వచ్చింది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ప్రజలకు అందుబాటులో వున్న 30 పడకల ప్రధాన ఆస్పత్రి ఇది. దీంతో ఆయా ప్రాంతాల్లో తరచూ జరిగే ప్రమాదాల్లో గాయపడే వారు చికిత్స నిమిత్తం ఇక్కడకే వస్తుంటారు. వీరిలో అవసరమైన వారికి రక్తం అందివ్వాలంటే గతంలో ఆ సదుపాయం లేదు. దీంతో తప్పనిసరిగా క్షతగాత్రులను విశాఖకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇదేకాకుండా అవసరమైన గర్భిణులకు శస్త్రచికిత్సలు చేయాల్సి వుండడంతో వారికీ రక్తం అందివ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. కానీ ఆ సదుపాయం ఇక్కడ లేకపోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యపై ప్రజలు అధికారులు, ప్రభుత్వానికి తెలియజేయడంతో... స్పందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రక్తాన్ని నిల్వ చేసుకునే యూనిట్‌ను మంజూరు చేయడంతోపాటు దాన్ని ఆస్పత్రికి పంపించింది. దీంతో ఇది ప్రస్తుతం వినియోగంలోకి వచ్చింది. ప్రస్తుతం విశాఖలోని విక్టోరియా జనరల్ ఆస్పత్రి నుంచి పలు గ్రూప్‌ల రక్తం ప్యాకెట్లు అందిస్తున్నారు. వాటిని అవసరమైన వారికి వినియోగిస్తారు. అవి అయిపోతుంటే మళ్లీ కొత్తవాటిని పంపుతారు. ఇప్పటికే ఇక్కడ నిల్వ వున్న రక్తాన్ని పలువురు రోగుల కోసం వినియోగించారు. ఇంకా ఏ సమయంలోనైనా వినియోగించడానికి రక్త నిల్వలు సిద్ధంగా వున్నాయి. ఇప్పటి వరకు రక్తం లేని కారణంతో రోగులు ఎంతో శ్రమతో విశాఖకు వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం చొరవతో రక్తం నిల్వ యూనిట్ అందుబాటులోకి రావడంతో అందరికీ ప్రయోజనకరంగా మారింది. ఇన్నాళ్లూ లేని మంచి సదుపాయం అందుబాటులోకి రావడంతో స్థానికులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నూకాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు



పాట్నూరులోని నూకాలమ్మ ఆలయం



నూకాలమ్మ విగ్రహం

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం నుంచి రెండు రోజులు నిర్వహించనున్న నూకాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. పాట్నూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. పాట్నూరులోని నూకాలమ్మ ఆలయానికి సున్నం వేసి ముస్తాబు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం పాట్నూరు నుంచి రథాలను తీసుకొచ్చి నూకాలయ్య ఆలయం చుట్టూ తిప్పుతారు.

ఈ సందర్భంగా సోమవారం, మంగళవారం ఆలయ ప్రాంగణంలో సాయంత్రం తిరునాళ్లు జరుగుతాయి.

వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

చురుగ్గా పెద్దచెరువు బ్యూటిఫికేషన్ పనులు

- 25 ఎకరాల్లో అభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- జూలైలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చిల్లపేట వద్ద చెరువు బ్యూటిఫికేషన్ పనులు పరిశీలిస్తున్న స్థానికులు



సంతపేట వైపు శరవేగంగా నిర్మాణ పనులు

తగరపువలస: ఎట్టకేలకు చిట్టివలస పెద్దచెరువు బ్యూటిఫికేషన్ పనులు ఊపందుకున్నాయి. ఇక్కడి చెరువులో 25 ఎకరాల్లో రూ.6.50 కోట్లతో చేపట్టనున్న గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ పనులకు సంబంధించి గత ఏడాది జూలైలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి రోడ్డులో శిలాఫలకం ఆవిష్కరించారు. తర్వాత చెరువులో ప్రభుత్వ స్థలం సర్వే, వర్షాల కారణంగా అభివృద్ధి పనుల్లో కాస్త జాప్యం జరిగింది. ఇటీవల బ్యూటిఫికేషన్ పనులు ప్రారంభించిన అధికారులు సంతపేట, నమ్మివానిపేట తదితర గ్రామాల నుంచి వచ్చే నీరు చెరువునీటిలో కలవకుండా ప్రత్యేకంగా మార్గం ఏర్పాటు చేశారు. చెరువు గట్లపై తుప్పలు తొలగించి గ్రావెల్‌తో పటిష్టం చేశారు. ప్రస్తుతం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇది పూర్తయితే తగరపువలస, చిట్టివలస గ్రామాలకు చెందిన వారు వాకింగ్ చేసుకోవడానికి చెరువు గట్టుపై ట్రాక్ సిద్ధం అవుతుంది.

మత్స్యకారులను ముంచిన గంటా

36.40 ఎకరాల విస్తీర్ణం కలిగిన చిట్టివలస పెద్దచెరువులో 1989 నుంచి తాటితూరు స్వదేశీ మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం పేరుతో 2 వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. వీరు ఏటా 25 టన్నుల వరకు చేపలను సాగు చేస్తారు. 86 మంది సభ్యులున్న ఈ సంఘం ద్వారా ఏటా జూన్‌లో రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి వచ్చే ఏడాది మార్చిలో దిగుబడి తీస్తుంటారు. 2019 ఎన్నికల ముందు అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు చెరువు బ్యూటిఫికేషన్ పేరుతో రూ.1.98 కోట్లతో హడావుడిగా శిలాఫలకం ఆవిష్కరించారు. చెరువు అభివృద్ధి పేరుతో సాగులో ఉన్న చేపలు ఎదగకుండానే మత్స్యకారులతో బలవంతంగా తొలగించేలా చేసి అప్పట్లో వారికి పెట్టుబడిలో రూ.6 లక్షల నష్టం కలిగించారు. చెరువు నుంచి నీటిని తోడించడంతో నెర్రలు వారి మత్స్యకారులు ఉసూరుమన్నారు. ప్రభుత్వం నుంచి లీజు ఆర్డర్ ఉండగానే చెరువును బలవంతంగా ఖాళీ చేయించడంతో మత్స్యకారులు అప్పటి మంత్రులు గంటా శ్రీనివాసరావు, కొల్లు రవీంద్రకు మొర పెట్టుకున్నా న్యాయం జరగలేదు. చెరువును ఖాళీ చేయించిన కారణంగా చుట్టుపక్కల పదుల సంఖ్యలో వ్యవసాయ, తాగునీటి బావులు సైతం అప్పట్లో ఎండిపోయి కరువును తలపించాయి. దీంతో మత్స్యకారులు తమకు అన్యాయం జరిగిందంటూ సొసైటీ తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పుణ్యకాలం గడిచిపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయి వేసిన గట్లు బీటలు వారిపోయాయి.



టీడీపీ హయాంలో బ్యూటిఫికేషన్ పనుల పేరుతో ఎండగట్టిన చెరువు

పరిపాలన రాజధానితో మరింత అభివృద్ధి

- స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పీఎం పాలెంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు



మధురవాడ తారకరామ లే అవుట్‌లో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : విశాఖ పరిపాలన రాజధాని కావాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు తారకరామ లే అవుట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఇక్కడ రోడ్ల నిర్మాణం జరిగిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిపాలనా రాజధానికి అన్ని విధాలుగా అనువైన ప్రాంతం విశాఖ అని, రాజధాని అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబయి వంటి నగరాలతో పోటీపడగల నగరమన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. చంద్రబాబు సీఎం అయితే అమరావతినే రాజధాని చేస్తారని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందన్న విషయాన్ని అంతా గమనించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, ఆదినారాయణ, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, జగ్గపిల్లి నరేష్, జగ్గపిల్లి సాయి, పోతిన శేషుబాబు, ఎస్.జగన్‌మోహన్‌రావు, పెంద్ర అప్పన్న, బెల్లాపు పాపారావు, బంగారు ప్రకాశ్, పసుపులేటి గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

పీఎం పాలెం: కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే సాధ్యమైందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం పీఎం పాలెంలోని హెచ్‌పీసీఎల్ లే అవుట్, సాండ్ అండ్ సాండ్ లే అవుట్ ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ పాలనలో ఎన్నో అవస్థలు పడిన రోజులను ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ఆర్థిక ప్రయోజనం పొందిన వారంతా మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి, ఆరో వార్డు పార్టీ అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన సూరిబాబు, ఎల్లాజీ, వీవీ నరసింహారావు, ఎం.ఈశ్వరరావు, అనూష, జామి శివకుమార్, అప్పారావు, రవి, రాయన సాయికుమార్, కాశీ ప్రసాద్ పాల్గొన్నారు

జాగ్రత్తలతోనే ఎండలతో రక్షణ

పద్మనాభం: ఎండలు తీవ్రంగా వున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు కోరారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరుగుట, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వడదెబ్బగా గుర్తించి జాగ్రత్తలు పాటించాలన్నారు. వడ దెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఎండలో తిరగకూడదని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ఉగాది సంబరాలు



ఉగాది పచ్చడి తయారు చేస్తున్న సభ్యులు

కొమ్మాది: ఎండాడ అథ్లెటిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎండాడలో ఆదివారం ఉగాది సంబరాలు ముందస్తుగా జరుపుకున్నారు. అందరూ సంప్రదాయ దుస్తుల్లో వచ్చి, ఉగాది విశిష్టతను పిల్లలకు తెలియజేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ కోచ్ వైకుంఠరావు, సభ్యులు రమేష్, రాజేంద్రప్రసాద్, రమేష్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.